అతి వేగంతోనే ఎక్కువ ప్రమాదాలు

- ఉప రవాణా కమిషనర్ రాజారత్నం
- సింహాచలం ఆర్టీసీ డిపోలో ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు


సింహాచలం డిపోలో బహుమతులు పొందిన డ్రైవర్లతో డీటీసీ రాజారత్నం, ఈడీ రవికుమార్, తదితరులు

గోపాలపట్నం: వాహనదారులు అతివేగంగా వాహనాలు నడపడం వల్లే 76 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం అన్నారు. సింహాచలం ఆర్టీసీ డిపోలో రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అతి వేగం వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు గణంకాల ప్రకారం తేలిందన్నారు. ఈ ప్రమాదాలు నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అతివేగం వల్ల 76 శాతం, తప్పుడు మార్గంలో ప్రయాణించడం వల్ల 5 శాతం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల 5 శాతం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల 6 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రహదారి భద్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఫోన్ సైలెంట్ మోడ్‌లో పెట్టుకోవాలని సూచించారు. సేఫ్టీ డ్రైవింగ్ వల్ల మీ ప్రాణాలతోపాటు మీపై నమ్మకంతో ప్రయాణిస్తున్న వారి ప్రాణాలు కాపాడినవారవుతారన్నారు. ఈ సందర్భంగా విశాఖ రీజియన్ డిపోల పరిధిలో సింహాచలం, విశాఖపట్నం, మధురవాడ, గాజువాక, వాల్తేర్, మద్దిలపాలెం డిపోల నుంచి మొత్తం 21 మంది డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్ అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వారిలో జోన్ బెస్ట్ డ్రైవర్ ఎస్ఏఎస్ రాజును అభినందించారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ – 1 ఈడీ సి.రవికుమార్, డీపీటీవో అప్పలరాజు, డిప్యూటీ సీఎంవో కె.వెంకటరావు, విశాఖ రీజినల్ డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలకు మోడీ సర్కార్ తూట్లు


సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

మల్కాపురం: దేశవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే పారిశ్రామిక సమ్మెలో తాము భాగస్వాములం అవుతామని హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు నినదించారు. సమ్మెను పురస్కరించుకుని హెచ్‌పీసీఎల్ రఫ్ గేటు వద్ద సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలకు మోడీ సర్కార్ తూట్లు పొడిచిందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరిస్తూ, ప్రైవేట్ సంస్థలను నడుపుతున్న బడాబాబులకు మోడీ అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఎంతో నమ్మకంతో దేశ ప్రజలు బీజేపీకి అవకాశం ఇస్తే వారు అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మోడీ సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. శుక్రవారం జరగనున్న సమ్మెను అంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. మరోవైపు సమ్మె నోటీసును పారిశ్రామిక ప్రాంత అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు భోగవల్లి నాగభూషణం (ఐఎన్‌టీయూసీ), నక్క లక్ష్మణరావుయాదవ్ (టీఎన్‌టీయూసీ), ఎం.జగ్గునాయుడు (సీఐటీయూ) తదితరులు హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ హెచ్ఆర్ కాళీకి గురువారం సాయంత్రం అందజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెకు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజతో పాటు అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కార్పొరేటర్ కొణతాల సుధ కోరారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం వద్ద వార్డు పరిధిలోని 134, 135, 136 నంబరు బూత్ లెవెల్ ఏజెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. ఆ పథకాలతో లబ్ధిపొందిన వారితో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత అందరిపైనా వుందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల అధ్యక్షుడు భోగవల్లి నాగభూషణం, నాయకులు చట్టి నూకరాజుయాదవ్, కొల్లి నూకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారి

కంచరపాలెం: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ, ఎన్‌సీసీ యూనిట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోలీస్(ట్రాఫిక్) ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం పాత ఐటీఐ జంక్షన్‌లోని పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ) కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఆర్.సిహెచ్.శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఐ.రఘుబాబులు మాట్లాడుతూ భద్రతా నియమాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం వాకథాన్ నిర్వహించారు. రోడ్డు భద్రతా నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి గణేష్‌రెడ్డి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ యు.ఉమాశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు అందించాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, తదితరులు

విశాఖ విద్య: నులి పురుగుల నివారణకు ప్రభుత్వం అందించే మాత్రలను 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసున్న వారంతా వేసుకునేలా వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 52వ వార్డు అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం మాత్రలు పంపిణీ చేశారు. నులి పురుగుల నివారణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించేలా ముద్రించిన ప్రచార కరపత్రాలను అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం బాలింతలకు గుడ్లు, పాలతో కూడిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు అందించాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పదార్థాలు ఎంతో బలవర్థకమైనవన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న అతిథులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో ఓఎన్‌జీసీ సహకారంతో నూతనంగా నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి విద్యార్థులతో ప్రారంభింపజేశారు. విభాగ విద్యార్థులకు ఉపయుక్తంగా ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందించిన ఓఎన్‌జీసీ అధికారులకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ సీజీఎం పి.ఎస్.రామారావు, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల, ఆచార్య బి.బి.వి శైలజ, ఆచార్య కె.బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన


శిబిరంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది


యువకుడి కేస్ షీట్ రాస్తున్న వైద్యుడు వికాశ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ అప్పలనరసింహ కాలనీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో స్థానికులు తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి, ఎముకులు, జనరల్ ఫిజీషియన్, తదితర విభాగాల వైద్యులు శిబిరంలో వైద్య సేవలు అందించారు. రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. శిబిరానికి వచ్చిన వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. సచివాలయ వైద్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ప్రజలకు సహకారం అందించారు. ల్యాబ్ టెక్నీషియన్ బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. చంద్రనగర్ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి వికాశ్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

మగ్గం వర్క్‌పై మహిళలకు ఉచిత శిక్షణ


మాట్లాడుతున్న కోరమాండల్ డీజీఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ గ్రామంలో గల సామాజిక భవనం వద్ద మగ్గం వర్క్‌పై స్థానిక మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు గురువారం ఉదయం ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా లక్క లెర్నింగ్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. గ్రామంలో సుమారు 32 మంది మహిళలకు మగ్గం వర్క్‌పై నేటి నుంచి ఉచిత శిక్షణ అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ ఉన్నతాధికారులు కె.శ్రీకాంత్, ఎస్.వెంకటరమణ, ములగాడ గ్రామ పెద్దలు ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి, గురుబిల్లి రామచంద్రరెడ్డి, పట్నాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా నిలవాలి

- డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు

మహారాణిపేట : సాగుకు అవసరమైన రుణాలు అందించి రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ మర్రిపాలెంలో గల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 2024–25 వార్షిక బడ్జెట్‌పై సభ్యుల సమక్షంలో పూర్తి స్థాయిలో చర్చించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో బ్యాంక్ బ్రాంచిల ద్వారా అమలు చేస్తున్న కార్యకలాపాలను బ్యాంక్ సీఈవో డీవీఎస్ వర్మ మహాజన సభ ముందుంచారు. డిసెంబర్ మాసాంతం వరకూ వచ్చిన ఆదాయ, వ్యయాలపై వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి చేపట్టబోయే కార్యకలాపాలు, వాటికి వెచ్చించే బడ్జెట్‌ను తెలియజేశారు. దీనికి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ సొసైటీల బలోపేతానికి పీఏసీఎస్ అధ్యక్షులు కృషి చేయాలన్నారు. సొసైటీల ద్వారా ఇచ్చిన రుణాలు సకాలంలో చెల్లించటం ద్వారా ప్రభుత్వం అందించే పలు రాయితీలు వస్తాయని, ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అంతా సమన్వయంతో పని చేసి బ్యాంకు అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. సొసైటీల బలోపేతం, రైతాంగానికి అందించాల్సిన మరింత సాయంపై పలువురు సభ్యులు సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వంచే కొత్తగా నామినేట్ అయిన చైర్మన్లను కోలా గురువులు ఘనంగా సన్మానించారు. సభ్యుల సహకారంతో సొసైటీల అభివృద్ధికి పని చేయాలని కోరారు. మహాజన సభలో కేంద్ర సహకార బ్యాంకు సీఈవో వర్మ, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల్లో నియామకం



గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల్లో పలువురిని నియమిస్తూ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. అందులో విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురికి పదవులు లభించాయి. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పదవులు లభించిన వారిని ఆయన అభినందించారు. పార్టీ బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

- వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ విభాగ ఉపాధ్యక్షుడిగా దాసరి రవి, ప్రధాన కార్యదర్శిగా నక్క త్రినాథరావు, కార్యదర్శులుగా ఒబ్బి అప్పలనాయుడు, కోరాడ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా బొంగు ఈశ్వరరావు, కోరాడ రాంబాబు, సూరాడ పెంటారావు నిమితులయ్యారు.
- క్రిస్టియన్ మైనారిటీ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చింతా ప్రభాకరరావు, కార్యదర్శిగా కొండపల్లి జకలివింగ్‌స్టన్, యమలదాసు, గజ్జల లక్ష్మి నియమితులయ్యారు.
- ఐటీ విభాగం జిల్లా ఉపాధ్యక్షునిగా వినోద్ కుమార్, కార్యదర్శులుగా ఎస్.రామకృష్ణ, కోరుబిల్లి మహేష్, నదిగంట్ల నాగమణి, సంయుక్త కార్యదర్శులుగా మల్ల గౌరి వెంకట సుబ్రహ్మణ్యం, పోతబత్తుల సురేష్‌కుమార్ నియమితులయ్యారు.
- మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా సిరిపురం సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా జలగం నాగలక్ష్మి, కార్యదర్శులుగా బొడ్డేటి లక్ష్మి, గనగల్ల పార్వతి, సంయుక్త కార్యదర్శులుగా ఆసి లక్ష్మి నియమితులయ్యారు.
- మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా లబ్బుల్ ఖాదిర్ జిలానీ, కార్యదర్శిగా సాయిక్ రెహమాన్, మహమ్మద్ సురజుద్దీన్, సంయుక్త కార్యదర్శులుగా సాయిర్ నాగూర్, పటాన్ సమ్దిక్ బేగం, హజారి మహమ్మద్ ముస్తఫా, సాయిక్ జిలానీ నియమితులయ్యారు.
- ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా కొటాన రవి, ప్రధాన కార్యదర్శిగా ఎల్లేటి విజయ్‌కుమార్, కార్యదర్శులుగా యలగడ రాజు, చెంగల సూరిబాబు, సంయుక్త కార్యదర్శులుగా తిరుపతి వెంకటదుర్గారావు, ముంజేటి హనుమంతురావు, పెద్దాడ వెంకటరమణ, రాగోలు నాని, కడితి అప్పలరాజు నియమితులయ్యారు.
- ఎస్టీ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాసరి శామ్యూల్, కార్యదర్శిగా బండి శ్రీను, గంటా జగన్నాథం, సంయుక్త కార్యదర్శులుగా గలరి నాగమణి, డి.విజయ్ కుమార్, కొతంగి కల్పన నియమితులయ్యారు.
- విద్యార్థి విభాగ జిల్లా ఉపాధ్యక్షుడిగా మొల్లి మురళి, ప్రధాన కార్యదర్శిగా భీమర శెట్టి సాయిలక్ష్మి, కార్యదర్శులుగా కోనబెల్లి కిరణ్‌కుమార్, కర్రి అజయ్, సంయుక్త కార్యదర్శులుగా కర్రి సూరిబాబు, బూసి సుకన్య నియమితులయ్యారు.
- చేనేత విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొజ్జ వెంకట్ గణేష్, కార్యదర్శిగా పొన్నగంటి శ్రీనివాసరావు, కొనపల చిన్నాబాబు నియమితులయ్యారు.
- యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూరాడ అనుదీప్, కార్యదర్శులుగా శుక్ల శంకర ప్రసాద్, రేసపు శ్రీనివాస రెడ్డి, పాలమరశెట్టి విజయ్, గొమ్మది సత్యనారాయణ నియమితులయ్యారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఘనంగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాన్ని విశేషంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా ముగిసిన మెగా స్పోర్ట్స్ కార్నివాల్


ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న కేజీహెచ్ ఉద్యోగులు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ, కింగ్ జార్జీ ఆస్పత్రులు సంయుక్తగా నిర్వహించిన మెగా స్పోర్ట్స్ కార్నివాల్ గురువారంతో ముగిసింది. ఈనెల 11న మొదలై నేటి వరకు ఏఎంసీ, ఇతర మైదానాల్లో పలు ఈవెంట్లు జరిగాయి. ఉద్యోగుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు, అలాగే ఏఎంసీ వంద సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించారు. 60 సంవత్సరాలు పైబడిన వైద్య ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది ఈ క్రీడా పోటీల్లో ఉత్సహంగా పాల్గొని మిగతా ఆస్పత్రుల కంటే ఎక్కువ బహుమతులు గెలిచి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. వివిధ క్రీడల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు పతకాలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలను సూపరింటెంటెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు అందించారు. ఈ ముగింపు పోటీల్లో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ నాయుడు, డీఈఈ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు అందుకుంటే విజయం మీదే

- నవ్య ఆలోచనలతో పనిచేసే యువతకు వర్సిటీ స్వాగతం
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి


ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: నవ్య ఆలోచనలతో పనిచేసే యువతను వర్సిటీ స్వాగతిస్తుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి అన్నారు. వారి ఆలోచనలు ఆచరణలో చూపే విధంగా ప్రోత్సహిస్తుందన్నారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే ఐదు రోజుల వర్క్‌షాప్ 'ట్రైనింగ్ ఫర్ ఇండస్ట్రీ 2కె 24' ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తన జీవితంపై సరైన దృక్పథాన్ని కలిగి ఉండాలని సూచించారు. తమ జీవిత కథను రచించుకోవడానిక సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. ప్రతీ రోజు మనకు సరికొత్త అవకాశాలు కల్పిస్తుందని, వీటిని స్వీకరించే సానుకూల దృక్పథం కలిగి ఉండాలని వీసీ సూచించారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన మీరంతా అసాధారణ స్థాయికి ఎదగాలనే ఆకాంక్ష, తపనతో ముందడుగు వేయాలన్నారు. ముందుగా మీపై మీరు నమ్మకం కలిగి ఉండాలన్నారు. ఏయూలో నవ్య ఆలోచనలతో పనిచేసే యువతను ప్రోత్సహించే ఏకైక ఉద్దేశంతో అవంతి, ఎలిమెంట్, ఆ హబ్ వంటి స్టార్టప్ వ్యవస్థలను అభివృద్ధి చేసి అందుబాటులో ఉంచామన్నారు. సాధారణ విద్యార్థులుగా ఇక్కడికి వచ్చి, నేడు ఉన్నత స్థానాలకు ఎదిగిన పూర్వ విద్యార్థుల జీవితాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. రసాయన శాస్త్రం పూర్వ విద్యార్థి దేవ పురాణం ఇటీవల ఎఫ్‌డీఏ డైరెక్టర్‌ను ఏయూకు తీసుకువచ్చిన విధానం, ఫార్మసీ హాస్టల్ నిర్మాణానికి విరాళంగా అందించడం, విభాగానికి కోట్ల రూపాయలు విలువైన ప్రయోగ ఉపకరణాలు అందించడాన్ని విద్యార్థులకు వివరించారు. ఇటువంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని అత్యున్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు.

నిస్వార్థంగా సహాయం చేయాలి

ఓఎన్‌జీసీ సీజీఎం పి.ఎస్.రామారావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు నిస్వార్థంగా సహాయం చేయాలన్నారు. చిన్న సహాయం, ఉపకారం పొందినా కృతజ్ఞతతో ఉండటం అలవాటు చేసుకోవాలన్నారు. పూర్వ విద్యార్థి నరసింహరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలు, పని సంస్కృతిని విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. ఫార్మా రంగంలో ఉండే విభిన్న విభాగాల పనితీరుపై విద్యార్థులకు శిక్షణలో భాగంగా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల, ఆచార్య బి.బి.వి శైలజ, ఆచార్య కె.బసవయ్య, ఆచార్య వి.సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రహదారి పరిశుభ్రతకు ప్రాధాన్యం

పెందుర్తి : బీఆర్‌టీఎస్ రహదారి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తెలిపారు. తక్షణమే బీఆర్‌టీఎస్ రహదారిపై పరిశుభ్రత పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం కృష్ణానగర్, చినముషిడివాడ, శారదాపీఠం రోడ్డును కమిషనర్ పరిశీలించారు. రోడ్డు మార్జిన్లలో వ్యర్థాలు లేకుండా చూడాలని సూచించారు. కృష్ణానగర్ ఫుట్‌పాత్ వంతెన పాదచారులు నడిచేందుకు ఇబ్బందులు లేకుండా తగిన మరమ్మతులు చేపట్టాలని జెడ్సీ హైమావతికి ఆదేశాలు జారీ చేశారు. ఫుట్‌పాత్‌ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని చెప్పారు. బీఆర్‌టీఎస్ రహదారిపై బస్టాప్‌లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు చెప్పారు. ప్రైవేటు ప్రకటనలకు సంబంధించిన పోస్టర్లను తొలగించాలన్నారు.